పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుతాం


సమావేశానికి హాజరైన కార్వాన్ కాంగ్రెస్ పదాధికారులు

జియాగూడ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని సీట్లల్లో సత్తా చాటుతుందని కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిషన్ గజరే అన్నారు. గురువారం కార్వాన్ నుంచి ఎల్బీస్టేడియంలో ఏర్పాటైన బూత్ లెవల్ ఏజెంట్ సమావేశానికి పెద్ద ఎత్తున కార్వాన్ కాంగ్రెస్ పార్టీ పదాధికారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కిషన్ గజరే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురకుల కృష్ణ, బీ–బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు, గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు షేక్ షకీల, కార్యదర్శి ఎస్.గిరి, కార్వాన్ డివిజన్ అధ్యక్షులు అల్లె రామ్‌కుమార్, యువత ఉపాధ్యక్షులు వి.గోవర్ధన్‌రెడ్డి, సయ్యద్ హబీబ్, సయ్యద్ అలీమ్ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ఎగ్జిబిషన్ సొసైటీ కృషి


ఎగ్జిబిషన్ కార్యదర్శి హన్మంతరావును కలిసిన మహాత్మాగాంధీ లా కళాశాల విద్యార్థులు

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి ఎగ్జిబిషన్ సొసైటీ ప్రత్యేక కృషి చేస్తుందని ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.హన్మంతరావు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ లా కళాశాల విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను సందర్శించి కార్యదర్శి హన్మంతరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ..తమ సొసైటీ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులకు ప్రతి సంవత్సరం నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 20 విద్యా సంస్థలను కొనసాగిస్తున్నామన్నారు. విద్యార్థులకు అన్నివిధాల సొసైటీ ఆధ్వర్యంలో సహకారం అందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా తమ విద్యాసంస్థ విద్యార్థులు రాణించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల విద్యార్థులు అమృత్, విక్రాంత్, స్నేహ, సోనం, రేవంత్, మౌనిక, చరిత, తన్య, భవ్య, ప్రొఫెసర్ మసూద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం


సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న 14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య


విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న పులిపాటి రాజేశ్ కుమార్

అబిడ్స్: జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను అబిడ్స్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టులలో తమ పేర్లను చూసుకుని లేనిచో నమోదు చేయించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అందరిచే బాలయ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ శైలజ, సూపరింటెండెంట్ అష్రఫ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినికేతన్ హై స్కూల్‌లో ..

బహదూర్‌పురా: అర్హులందరూ తమ పేర్లను ఓటరు లిస్టులో నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆయన దూద్‌బౌలి శాంతినికేతన్ హై స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. బీఎల్‌ఓ సూపర్‌వైజర్ గంటి రమేష్, బీఎల్‌ఓలు మనీష్, మధుర, లీల పాల్గొన్నారు.

ఐటీఐ ప్రాంగణంలో..

విజయనగర్‌కాలనీ: ఓటు వజ్రాయుధం లాంటిదని మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపల్ పుష్పాల జ్యోతిరాణి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం ఐటీఐ ప్రాంగణంలో ఓటుహక్కు కలిగిన విద్యార్థుల చేత ఓటును సద్వినియోగపరచుకుంటామని విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. శిక్షణాధికారి మన్నెబోయిన కృష్ణాయాదవ్ మల్లేష్, జాకీర్, శ్రీనివాస్, స్వప్న, బాషా, అజయ్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డిలతో పాటు ఐటీఐ శిక్షణాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలో భారత్ పాత్ర కీలకం


టెలిస్కోపు ద్వారా సూర్యునిలోని నల్లటి మచ్చలను వీక్షిస్తున్న విద్యార్థులు

చార్మినార్: అంతరిక్ష పరిశోధనలో భారత దేశం పాత్ర క్రియాశీలకంగా ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జే.రుక్మిణి అన్నారు. సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఖగోళ శాస్త్రంలో చిక్కు ముడులు వాటి అన్వేషణలో భారతదేశ పాత్ర అనే అంశంపై ఒక రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సులో జె.రుక్మిణి పాల్గొని మిషన్ మంగళయాన్, మిషన్ చంద్రయాన్ల పరిశోధన లోని కీలక అంశాలపై ప్రసంగించారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. బాల భాస్కర్ ప్రారంభ ఉపన్యాసంలో పీజీ విద్యార్థులు ఖగోళశాస్త్ర పరిశోధనా నైపుణ్యాలను పెంచుకొని దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ఈ సదస్సు సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డా.నైన వినోదిని అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఉస్మానియా విశ్వ విద్యాలయ ఖగోళ శాస్త్ర విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. సదస్సు అనంతరం ఆచార్య జె.రుక్మిణీ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దూరదర్శిని (టెలిస్కోప్) ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు సూర్యునిలోని నల్లటి మచ్చలను వీక్షించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు డా. వాసుదేవ రెడ్డి, డా. పర్వతాలు, డా. చిన్ని క్రిష్ణ, డా.లక్ష్మి శ్రీనివాస రావు, డా. సువర్ణ భాతే పాల్గొన్నారు.



చార్మినార్ ప్రధాన వీధుల్లో తిరంగా ర్యాలీ

చార్మినార్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారి ఆధ్వర్యంలో రూపొందించిన 300 మీటర్ల అతి పెద్ద తిరంగా జెండాతో గురువారం చార్మినార్ ప్రధాన వీధుల్లో పెద్ద ఎత్తున తిరంగా జెండా ర్యాలీ జరిగింది. మదీనా, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌజ్, చార్‌కమాన్, చార్మినార్ మీదుగా తిరిగి మదీనా సర్కిల్‌కు చేరుకున్న ఈ తిరంగా ర్యాలీలో వినియోగించిన జెండా మొత్తం కొలత 11,700 అడుగులుందని మహ్మద్ ఇలియాస్ బుకారీ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

విజయనగర్‌కాలనీ: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న దొంగను టప్పాచబుత్ర పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ కేహెచ్‌కే ఫంక్షన్‌హాల్ వద్ద నుంచి ద్విచక్ర వాహనాలు కనిపించకుండా పోతున్నాయని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాల దొంగ టప్పాచబుత్ర జిర్రాలో సంచరిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు అనుమానాస్పదంగా కనిపించిన సయ్యద్ ఇమ్రాన్(29)ను బుధవారం అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఇటీవల ఇతడు మూడు ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.


గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుని మూడు రంగుల లైటింగ్‌తో అలంకరించిన హైకోర్టు భవనం మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో రాత్రి సమయంలో చూపరులను ఆకట్టుకుంటుంది.
- సాక్షి సిటీబ్యూరో

మహిళల రక్షణకు తెలంగాణ పోలీస్ కృషి

సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ డీసీపీ సృజన


కార్యక్రమంలో డీసీపీ సృజన

గోల్కొండ: బాలికలు, మహిళల రక్షణకు తెలంగాణ పోలీస్ ఎంతగానో కృషి చేస్తుందని దీనికి గాను పోలీసు శాఖలో మహిళా సేఫ్టీ వింగ్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ డీసీపీ కె.సృజన అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అభయ ఉమెన్స్ సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ గర్ల్స్, చైల్డ్ డేలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను జీఎన్ఐటీఎస్ పూర్వ విద్యార్థి అయినందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. తాను ఎంతగానో ఇష్టపడే ఉమెన్ సేఫ్టీ విభాగంలో తనకు పోస్టింగ్ రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. నేడు సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న హింస, దౌర్జన్యాలను అరికట్టడానికి ఎన్నో చట్టాలు రూపొందించబడ్డాయని ఆమె అన్నారు. తాను చేస్తున్న కృషి వల్లే మహిళలపై జరుగుతున్న నేరాల సంఖ్య తగ్గిందని ఇటువంటి కేసుల్లో దోషులైన వారిని తాను పట్టువదలకుండా అరెస్టు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కిమ్స్ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ కావ్యప్రియ వజ్రాల కళాశాల విద్యార్థులతో మాట్లాడి శారీరక దృఢత్వం అవశకతపై వివరించారు. మనం శారీరకంగా, దృడంగా ఉండడమే కాకుండా మానసికంగా కూడా దృడంగా ఉండాలని దీన్ని వల్ల అన్యాయాలను, దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొగలుగుతామని అన్నారు. మిసెస్ యూనివర్స్–ఇంటిగ్రిటీ, గర్ల్ ఫౌండేషన్ ఫౌండర్ డైరెక్టర్ రోహిణి నాయుడు, కామ్ ఫర్ యూ డైరెక్టర్ ఆమీనాహుస్సేన్, లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ డైరెక్టర్ హర్షాచావ్లా, అభయ జీఎన్ఐటీఎస్ ఉమెన్ సేఫ్టీ క్లబ్ కన్వీనర్ అపర్ణ, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు సిల్వర్‌జూబ్లీ వేడుకలు


భీశ్వ ఓంప్రకాష్

అబిడ్స్: గన్‌ఫౌండ్రీ యువసేనా ఆధ్వర్యంలో గన్‌ఫౌండ్రీలో శుక్రవారం యువసేనా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నామని యువసేనా అధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. 25 ఏళ్లుగా గన్‌ఫౌండ్రీ యువసేనా ఆధ్వర్యంలో యువతకు పలు రంగాల్లో ప్రావీణ్యం చెందే విధంగా తీర్చిదిద్దామన్నారు. 26న శుక్రవారం సాయంత్రం పెద్ద ఎత్తున సిల్వర్ జూబ్లీ సంబరాలు చేస్తున్నారు. రామ మందిరం కరసేవలో పాల్గొన్న మహనీయులను ఘనంగా సత్కరిస్తామన్నారు. పలు క్రీడాపోటీలు, వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించి వారికి బహుమతులను అందజేస్తామని ఓంప్రకాష్ పేర్కొన్నారు. ఈ వేడుకలకు పలువురు రాష్ట్ర ప్రముఖులు విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. చిన్నారులతో సాంస్కృతిక నృత్యాలు, పాటలు, డ్యాన్సులు, వివిధ రకాల కళాత్మక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కే.వీ జాంబాగ్, రామకృష్ణ థియేటర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జాంబాగ్, పూసలబస్తీ లేన్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ ఎంజే మార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కరాచి బేకరి, రిజిస్ట్రార్ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్ లేన్, మాలకుంట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

'ఓటు వజ్రాయుధం లాంటిది'

గోల్కొండ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని బీజేపీ నాయకుడు యోగ్‌రాజ్ సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లోని మోహిని ఫంక్షన్‌హాల్‌లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బీజేపీ 'నమో నౌ మత్‌దాతా'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశ ప్రజలకు ఓటు విలువను తెలియజేసే కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. ఈ కారణంగానే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా పోలింగ్ బూత్‌కు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు జి.సునీల్‌యాదవ్, రక్షిత్ రాచకొండ తదితరులున్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



అబిడ్స్: తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం కలిశారు. గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు.

శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సురేందర్ రెడ్డికి చాంద్రాయణగుట్ట నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి, జమాల్‌పూర్ చంద్రశేఖర్, ఎడ్ల పండరీనాథ్ గురువారం ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.

సురేంద్ర లూనియా మృతి జైన సమాజానికి తీరని లోటు

అబిడ్స్: జైన రత్న సురేంద్ర లూనియా మృతి చెందడంతో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం తెలిపారు. సురేంద్ర లూనియా ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. సురేంద్ర లూనియా జైన సమాజానికి ఎంతో పాటు పడ్డారని, ఆయన మృతి జైన సమాజానికి తీరని లోటన్నారు. సురేంద్ర లూనియా అహింస కోసం పాటుపడ్డారని, అదే విధంగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు. సురేంద్ర లూనియా తనకు ఎంతో ఆప్తమిత్రుడు అని ఆయన అన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్‌ల పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ప్రతి నిత్యం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న పనుల విషయం తెలుసుకుంటున్నానని, అవసరమైతే తానే స్వయంగా పనులను పరిశీలిస్తున్నానన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని తాను అధికారులకు ఆదేశిస్తున్నానని ఆయన అన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

కళలతో మానసిక వికాసం


ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి తదితరులు

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను తగ్గించి మానసిక వికాసాన్ని పెంపొందించే శక్తి కళలకు ఉందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీ ప్రాంగణంలోని ఆర్ట్ గ్యాలరీలో గురువారం ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.... వందల సంవత్సరాల నాటి చరిత్రను నేటి తరాల వారికి తెలియజేసేందుకు ఫోటో చిత్రాలు తోడ్పడుతాయన్నారు. నేటి డిజిటల్ యుగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఫొటోగ్రఫీ విద్యార్థులు ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలన్నారు. దశాబ్దాల క్రితం ఉన్న ఫోగోచిత్రాలతో పాటు నేటి ఆధునిక యుగం వరకు తీసిన చిత్రాలు ఎగ్జిబిషన్‌లో కళాకారుల నైపుణ్యాన్ని చాటి చెబుతున్నాయన్నారు. కళామతల్లికి కళాకారులు చేస్తున్న సేవలు నిరుపమానమని కొనియాడారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ.రమణారావు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ, సినీనటులు అక్కినేని నాగేశ్వరరావులతో పాటు ప్రముఖ రాజకీయ నాయకుల చిత్రాలు అనేకమంది కళాకారుల కళాకృతులు ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో కళాకారులు జ్ఞానేశ్వర్‌రావు, విక్రమ్, వివేక్‌లతో పాటు ఫైనార్ట్స్ కళాశాల ఫోటోగ్రఫి విభాగాధిపతి ఏఆర్.కమల్‌రాయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత బాధ్యత కీలకం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆచార్య వాయు నందన్ రావు

చార్మినార్: ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత బాధ్యత కీలకమని ఇగ్నో పూర్వ ఉపకులపతి ఆచార్య వాయునందన రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ సిటీ కళాశాల, సామాజిక శాస్త్రాల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు ద్వారా ప్రజాస్వామ్యం వ్యవస్థను పరిరక్షించటంలో యువత బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆచార్య మోహన రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ధన స్వామ్యంగా మారి పోయిందని, డబ్బులు ఇస్తే తప్ప మేము ఓటు వేయం అనే స్థితికి ఓటరు రావటం బాధాకరమన్నారు. మరో అతిథిగా పాల్గొన్న శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత పాత్ర కీలకమన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్, డా.ఏ. శంకర్, డా.కృష్ణ వేణి, డా.భాస్కర్, డా.రత్న ప్రభాకర్, డా.యాదయ్య, లతా రాణి, డా.నాగరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పర్యవేక్షణలో స్థానికుల పాత్ర కీలకం


మైత్రి కమిటీ సభ్యులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణలో స్థానికుల పాత్ర కీలకమని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ కోట వద్ద పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం అమలు వల్ల నేరాలు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు కూడా నేరాల నియంత్రణకు దోహదపడుతున్నాయన్నారు. గోల్కొండ కోటలో జరిగే బోనాల ఉత్సవాలు సైతం శాంతియుతంగా జరగడంలో మైత్రి కమిటీ సభ్యుల పాత్ర ఎంతగానో ఉందని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు బి.శ్రీకాంత్‌చారి, రామకృష్ణ తదితరులున్నారు.

హజ్రత్ అలీ జయంతి ర్యాలీ



డబీర్‌పురా: హజ్రత్ ఇమామ్ అలీ జయంతిని పురస్కరించుకొని సిరాత్–ఏ–జహ్రా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కోట్లా ఆలిజా ప్రాంతంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ర్యాలీని మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు, బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ ఊరేగింపులో లుక్మాన్ హుస్సేన్ మూస్వి, మౌలానా అక్బర్ అలీ ఖాన్, సయ్యద్ అబ్బాస్ రజ్వీ అలియాస్ సయీద్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో మేరు కులస్తులకు అవకాశం కల్పించాలి


డిప్యూటీ సీఎంను కలిసిన వెంకటేశ్

గౌలిపురా: రాష్ట్రంలోని మేరు కులస్తులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మేరు సంఘం నేత కె.వెంకటేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను గురువారం ఆయన కార్యాలయంలో వెంకటేశ్ కలిసి శాలువాతో సన్మానించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..మేరు కులస్తులకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో మేరు కులస్తుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని పేర్కొన్నారు.

పాతబస్తీలో పర్యటించాలి


మంత్రి పొన్నంను సన్మానిస్తున్న కాశమోని శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. పాతబస్తీ అభివృద్ధి కోసం ఒకసారి పర్యటించాలని ఆహ్వానించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలోనే రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

జేఎన్‌ఎఫ్‌ఏయూలో రంగోళి పోటీలు



నాంపల్లి: గణతంత్ర్య దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని జేఎన్ఎఫ్ఏయూ కళాశాలలో విద్యార్థులకు రంగోళి పోటీలు నిర్వహించారు. ప్రకృతి రమణీయమైన దృశ్యాలతో పాటుగా విభిన్న ఆకృతులకు రూపాన్ని ఇచ్చారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తారు. ప్రతి ఏటా గణతంత్ర్య దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు రంగోళి పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. క్రియేటివ్ ఆర్ట్స్ విద్యార్థులు అద్భుతమైన ముగ్గులను ఆవిష్కరించారని తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి

యాకుత్‌పురా: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సరం కేలండర్‌ను గురువారం జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హమీద్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. విజయ్ భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, నాయకులు ప్రభావతి, పద్మజా, విలాసవతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌ను వీడేదే లేదు'


సంతోషి

జియాగూడ: తెలంగాణ ఉద్యమ కాలం నాటి నుంచి బీఆర్‌ఎస్‌లో సామన్య కార్యకర్తగా పని చేస్తూ డివిజన్ నాయకురాలిగా, సీనియర్ నాయకురాలిగా పనిచేసిన తాను ఇతర పార్టీలలోకి వెళ్లే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ నాయకురాలు సంతోషి అన్నారు. గురువారం ఆమె జియాగూడలో మరో నాయకురాలు అనితతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇతర పార్టీలలోకి వెళ్లినట్లు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నాటి నుంచి పనిచేస్తున్న తాము ఇతర పార్టీలలోకి వెళ్లలేదని మరోసారి స్పష్టం చేశారు.

నియామకం


వెంకట్ నారాయణ

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా కె. వెంకట్‌నారాయణ నియమితులయ్యారు. కొన్ని ఏళ్లుగా ఇదే సర్కిల్‌లో డీఈగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌నారాయణకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఇదే సర్కిల్ ఈఈగా పదవీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంగా ఈ సర్కిల్‌లో ఈఈగా పనిచేసిన ప్రకాశంను పాతబస్తీకి బదిలీ చేశారు.